సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 25.439 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం నాటికి 25.439 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,790
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,819
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,993
నవర (8 గ్రాములు)	రూ.47,944

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.3 /23.8

గురువారం గాలిలో తేమ 74 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. శుక్రవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

74.61 శాతం మందికి పింఛన్ల అందజేత



నెల్లూరు ద్వారకానగర్‌లో స్వాతికి వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అమరావతి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ జిల్లావ్యాప్తంగా మొదలైంది. మొదటి రోజు గురువారం 74.61 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. 3,18,983 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, 2,37,990 మందికి పింఛన్ నగదు పంపిణీ చేశారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదును అందజేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): నూతన జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం రాత్రి నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు.

జిల్లాకు కేంద్రం మొండిచేయి

• నిరాశ పరిచిన బడ్జెట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో మరోసారి జిల్లాకు రిక్తహస్తమే మిగిలింది. జిల్లాకు ఒక్క ప్రాజెక్ట్, పైసా ఇచ్చినట్లు ఎక్కడా కనిపించలేదు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ ఆధునికీకరణ సాగుతోంది. నడికుడి–శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌కు నిధులు కేటాయింపులు జరగలేదు. ఒక్క పైసా ఇవ్వకపోగా అంతా చేసేశామని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పడం గమనార్హం. మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. పీఎం ఆవాస్ యోజన కింద రూ.2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రైల్వే బోగీల నిర్వహణ అధ్వానంగా ఉన్న నేపథ్యంలో వందేభారత్ బోగీల్లా మార్చుతామని తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయుష్మాన్ పథకం వర్తిస్తుందని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.86 వేల కోట్ల కేటాయింపులే జరిగాయి. ఆదాయ పన్ను విషయంలో కూడా పెద్ద మార్పులు కన్పించలేదు. రూ.7 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. క్రీడారంగంలో మార్పులు తెచ్చామని ప్రకటించినా నిధులు ఇవ్వలేదు. జనధన్ కింద, వీధి వ్యాపారులకు ఆర్థికసాయం లాంటి ప్రకటనలు చేసినా జిల్లాలో ఆశించిన స్థాయిలో ఆ పథకాలు పేద వర్గాలకు ఉపయోగపడలేదు.

జెడ్పీ సీఈఓగా కన్నమనాయుడు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ సీఈఓగా కన్నమనాయుడిని నియమిస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఆర్ కమిషనర్ కార్యాలయంలో డీఎల్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న కన్నమనాయుడిని నెల్లూరుకు జెడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న బి.చిరంజీవి డిప్యూటీ సీఈఓగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు చిరంజీవి సీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు.

4న జిల్లా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్నామని జిల్లా మాస్టర్స్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 35, 40, 45, 50, 55, 60, 65, 70 – 75పైడిన విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలను వేర్వేరుగా నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు తమ పేర్లను అసోసియేషన్ సభ్యుడు తాళ్లపాక ప్రసాద్ వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలుగా నిలిచిన వారు రాజమహేంద్రవరంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. వివరాలకు 98669 30555 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'ఉపాధి'తో బతుకు భద్రం



పేదల బతుకుల్లో వెలుగులు

- జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు
- పథకానికి వన్నెతెచ్చిన వైఎస్సార్
- సీఎం జగన్ హయాంలోనూ విరివిగా పనులు
- బాబు సర్కారులో తీవ్ర నిర్లక్ష్యం
- పథకం ప్రారంభించి నేటికి 18 ఏళ్లు పూర్తి

దేశంలోని పేదల బతుకులకు భద్రత కల్పించడంతోపాటు ఆకలి చావులు, వలసలు, పస్తులు, కరువు లేని గ్రామీణ భారతాన్ని ఆవిష్కరించే లక్ష్యంతో ప్రారంభమైన జాతీయ ఉపాధి హామీ పథకం విజయవంతంగా ముందుకు సాగుతోంది. నిత్యం గ్రామీణ ప్రజలకు పనులు కల్పిస్తూ వారి ఆర్థిక పరిస్థితిలో మార్పు తీసుకువస్తోంది. ఈ పథకం ద్వారా లక్షలాది మంది ఉపాధి పొందుతూ సంతోషంగా జీవిస్తున్నారు.

ఉదయగిరి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పేదల జీవితాలకు భరోసా ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న వారికి ఈ పథకం వరంగా మారింది. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఈ పథకం ప్రారంభించి శుక్రవారానికి 18 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో దీని విజయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. 2006 ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ హయాంలో ఈ పథకం దిగ్విజయంగా ముందుకుసాగింది. పండ్లతోటల పెంపకం, ఇందిర జలప్రభ, ఎస్సీ, ఎస్టీల భూముల అభివృద్ధి ద్వారా వేల ఎకరాలు సాగులోకొచ్చాయి. నీటి సంరక్షణ, కాలువల్లో పూడికతీత, సాగునీటి సదుపాయాలకు అనుగుణంగా పనులు, భూఅభివృద్ధి తదితర పనులు చేశారు. అనంతరం చంద్రబాబు అధికారం చేపట్టాక ఈ పథకం టీడీపీ నేతలు, కార్యకర్తలకు కల్పతరువులా మారింది. వీరు ఉపాధి నిధులను అందినకాడికి దోచుకుని పనుల నాణ్యతకు తిలోదకాలిచ్చారు. నిధులు పక్కదారి పట్టించి కూలీలకు డబ్బులు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులపాలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులు తీసుకువచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి పనులను జియోట్యాగ్ ద్వారా చేపట్టి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. పనులకు వచ్చిన వారి ఆధార్‌ను అనుసంధానం చేసి కూలి డబ్బులు సక్రమంగా అందేలా డీబీటీ విధానం తీసుకువచ్చారు.



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి హామీ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. పనులు చేసిన వారికి కూలి డబ్బులు సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నారు. ఆధార్ అనుసంధానం చేయడంతో కూలి నగదు పక్కదారి పట్టకుండా నేరుగా కూలీలకే అందుతున్నాయి. నీటి సంరక్షణ పనులకు కూడా అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, సచివాలయ భవనాల ఏర్పాటుకు నిధులను ఈ పథకం ద్వారా ఖర్చు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో నిధులు పక్కదారి

చంద్రబాబు పాలనలో ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పట్టాయనే విమర్శలు ఉన్నాయి. నీరు–చెట్టు పేరిట టీడీపీ నాయకులు ఈ నిధులను దోచేశారు. తూతూమంత్రంగా పనులు చేసి నాణ్యతకు తిలోదకాలిచ్చి నిధులు స్వాహా చేశారు. ఈ అంశం కూడా పలు విచారణల్లో నిర్ధారణ అయింది. కూలీలకు సకాలంలో కూలి నగదు అందించకపోవడం ద్వారా ఇబ్బందులు పడ్డారు.

పథకం లక్ష్యం

- నైపుణ్యం అవసరం లేకుండా కేవలం శారీరక శ్రమతో కూడిన పనులు చేసేందుకు ముందుకొచ్చే వారికి వంద రోజులు పనులు కల్పించడం.
- ప్రత్యేక సందర్భాల్లో కూలీలకు ఏడాదికి 150 రోజుల వరకు పనిదినాలు కల్పిస్తున్నారు.
- తద్వారా పేదల జీవితాల్లో వృద్ధి సాధించడం.
- మహిళల సాధికారత, కూలీల కుటుంబాల్లో ఆత్మగౌరవం పెంపొందించడం.
- పండ్లతోటల పెంపకం, భూముల అభివృద్ధి ద్వారా వేల ఎకరాలు సాగులోకి తీసుకురావడం.
- నీటి సంరక్షణ, కాలువల్లో పూడికతీత, సాగునీటి సదుపాయాలను మెరుగుపరిచేలా పనులు చేయడం.

వేతనాల్లో భారీ పెరుగుదల

ఉపాధి హామీ పథకం అమలులోకి రాక ముందు ఉత్తరాది ప్రాంతాల్లో రోజుకు కూలి వేతనం రూ.20గా ఉండేది. ఈ చట్టం వచ్చాక కూలీల వేతనం గణనీయంగా పెరిగింది. కూలిపై జరిగే ఆర్థిక దోపిడీ కనిష్ఠ స్థాయికి తగ్గిపోయింది. 2006–07లో పథకం ప్రారంభించిన సమయంలో రోజుకు కనీస వేతనం రూ.50 కాగా అనంతరం రూ.77.67 వరకు పెరిగింది. 2010–11లో రూ.121, 2015–16లో రూ.180, 2019–20లో రూ.211 కూలీలకు అందింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీస వేతనం రూ.272 వరకు అందుతోంది.



ప్రస్తుత ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సచివాలయం

జిల్లాలో..

మొత్తం జాబ్ కార్డులు:	యాక్టివ్‌లో ఉన్నవి:
3.34 లక్షలు	2.67 లక్షలు

కూలీలకు నగదు (రూ.కోట్లలో)

2019-20 - 167.32	అలాగే సామాజిక
2020-21 - 238.25	ఆస్తుల కల్పనకు
2021-22 - 269.33	గత నాలుగేళ్లలో
2022-23 - 235.33	రూ.360 కోట్లు
2023-24 - 288.85	ఖర్చు చేశారు.

పని అడిగిన 14 రోజుల్లోనే పనులు కల్పిస్తున్నారు. పురుషులతోపాటు స్త్రీలకు కూడా సమానంగా వేతనం ఇస్తున్నారు. పని ప్రదేశంలో కూలీలకు, వారి పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కూలీలకు పనిని హక్కుగా కల్పిస్తూ ఈ చట్టం తీసుకొచ్చారు. తద్వారా పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

ఉపాధి హామీ పనుల ద్వారా అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. నీటి సంరక్షణ పనులకు మొదటి ప్రాధాన్యం కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తూ పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ పథకంలో మరింత నాణ్యతను, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– వెంకట్రావు, డ్వామా పీడీ

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సర్వేపల్లి గ్రామంలో గురువారం 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి పొదుపు సంఘాల్లోని అక్కచెల్లెమ్మల రుణ మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తానని గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ జిల్లాలో నాలుగు విడతల్లో 34,443 పొదుపు సంఘాల్లోని 3,29,846 మంది అక్కచెల్లెమ్మలకు రూ.1074.39 కోట్లు జమ చేశారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 4,063 పొదుపు గ్రూపులకు రూ.122.37 కోట్లు జమ చేశామని, ఒక్క వెంకటాచలం మండలంలోనే 832 గ్రూపుల్లోని 8,212 మంది మహిళలకు నాలుగు విడతల్లో రూ.25.07 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అలాగే వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత ద్వారా మహిళల ఖాతాల్లో రూ.18,500 కోట్ల నగదు ఈ నెల 16 తేదీన జమ చేయనున్నట్లు తెలిపారు. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందలేదని, జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ప్రయోజనం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. ఓ వైపు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, మరోవైపు గ్రామాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో సాగునీటికి సంబంధించి ప్రధానమైన సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధి గురించి టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న పాపాన పోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు వెచ్చించినట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడా మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్లు నిర్మించామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నాగంబోట్ల కండ్రిగ గ్రామానికి చెందిన 69 మంది రైతులకు మంత్రి కాకాణి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పొట్లూరు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, నాయకుడు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు మండలాల కేటాయింపు

నెల్లూరు(పొగతోట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఎంపీడీఓలను ఉమ్మడి నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఇందుకు సంబంధించి ఎంపీడీఓలకు మండలాలను కేటాయిస్తూ జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. చిత్తూరు జిల్లా నుంచి బదిలీ అయిన సి.గంగయ్యను జిల్లాలోని రాపూరు మండలానికి, ఎం.శంకరయ్యను కోటకు, జి.సుధాకర్‌ను సైదాపురానికి, కె.వెంకటేశ్వర్లును అనుమసముద్రంపేటకు, ఎ.ప్రేమ్‌రాజ్ కుమార్‌ను నాయుడుపేటకు, వి.ఆర్.నాగరాజును ఇందుకూరుపేటకు, షేక్ తాజ్‌మాస్‌రూర్‌ను అనంతసాగరానికి, కేఎస్ బాలాజీని తోటపల్లిగూడూరుకు, పి.శేషగిరిరావును సంగంకు, వి.అరుణను బాలాయపల్లికి, పి.భానుమూర్తిరావును చిల్లకూరుకు, పీఎంఆర్ ప్రభాకర్‌ను కలువాయికి, కె.సురేష్‌బాబును పెళ్లకూరుకు, పి.చంద్రమౌళిని సూళ్లూరుపేటకు, కె.శ్రీనివాసులును ఓజిలికి, ఎస్‌ఏ మహ్మద్‌రఫీని పొదలకూరుకు, పి.సాయిలహరిని చిట్టమూరుకు, కె.రామచంద్రను గూడూరుకు, ఒ.శివరాజును దొరవారిసత్రానికి, డి.నీలకంఠేశ్వర రెడ్డిని వెంకటగిరికి, సి.లీలామాధవిని డక్కిలికి, ఎస్.అబ్దుల్‌కలామ్ ఆజాద్‌ను, సీతారామపురానికి, ఎస్.మనోహర్‌రాజును మర్రిపాడు మండలానికి ఎంపీడీఓలుగా కేటాయించారు. అలాగే ప్రకాశం జిల్లా నుంచి బదిలీ అయిన ఎస్‌కే జమీవుల్లాను బోగోలు మండలానికి, టీవీ కృష్ణకుమారిని కలిగిరికి, ఆర్‌ఎం రాజ్యలక్ష్మిని బుచ్చిరెడ్డిపాళేనికి. డి.సురేష్‌బాబును దగదర్తికి, వి.ప్రద్యుమ్నకుమార్‌ను కొడవలూరుకు, కె.రాజశేఖర్‌రావును జలదంకికి, పి.సుజాతను కొండాపురానికి, బి.రామాంజనేయులును కోవూరు మండలానికి ఎంపీడీఓలుగా కేటాయించారు.

ఆదాయం పెంచే దిశగా చర్యలు చేపట్టండి

• ఎఫ్‌డీసీ రీజినల్ మేనేజర్ సందీప్‌కృపాకర్



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ సందీప్‌కృపాకర్

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వానికి చెందిన అటవీ భూముల్లో జామాయిల్ సాగు విస్తీర్ణం పెంచి సంస్థకు ఆదాయం పెంచే దిశగా చర్యలు చేపట్టాలని అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) నెల్లూరు రీజినల్ మేనేజర్ సందీప్‌కృపాకర్ గుండాల డివిజన్ మేనేజర్లను ఆదేశించారు. నగరంలోని ఎఫ్‌డీసీ ప్రాంతీయ కార్యాలయంలో ఉన్న తన చాంబర్‌లో గురువారం నెల్లూరు, కావలి, సత్యవేడు, బాపట్ల, నాయుడుపేట డీఎంలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన భూముల్లో సాగవుతున్న జామాయిల్ చెట్ల ద్వారా మరింత ఆదాయం తీసుకువచ్చి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. నెల్లూరు రీజియన్ పరిధిలో అత్యధికంగా జామాయిల్ సాగు ఉందన్నారు. ఇప్పటి వరకు నెల్లూరు రీజియన్ పరిధిలో సాగులో ఉన్న జామాయిల్‌ను దాదాపు 60 శాతం మేర విక్రయించామని, మిగిలిన 40 శాతం మరో రెండు నెలల్లో విక్రయించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. 1.20 లక్షల టన్నుల జామాయిల్ విక్రయం ద్వారా దాదాపు రూ.80 కోట్లు సంస్థకు రాబడి వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే రీజియన్ పరిధిలో 25 యూనిట్లలో 3,700 హెక్టార్లలో జీడిమామిడి తోటలు ఉన్నాయని, వాటి నుంచి సంవత్సరం పాటు ఫలసాయం పొందే హక్కు కోసం వేలం, టెండర్, నెగోసియేషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. అయితే తాము ఇప్పటికే నిర్వహించిన టెండర్ ప్రక్రియకు స్పందన రాని నేపథ్యంలో తిరిగి ఈ నెల 14వ తేదీన మరోసారి వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనేందుకు తమ కార్యాలయానికి రూ.50 వేల డీడీ లేదా నగదు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో నెల్లూరు, కావలి, బాపట్ల, నాయుడుపేట, సత్యవేడు డివిజన్ మేనేజర్లు శారద, పిచ్చయ్య, అరుణకుమారి, గీతిక, బ్రహ్మయ్య, నెల్లూరు ప్రాంతీయ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.



కంపసముద్రం గ్రామానికి చెందిన నల్లిపోగు చెన్నయ్య కుటుంబం

పేదల జీవితాల్లో ప్రగతి పథం

ప్రతి కుటుంబంలో వెలుగులు నింపిన 'నవరత్నాలు'



ఆత్మకూరు రూరల్ : అట్టడుగు వర్గాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ తోడ్పాటు లేక పేదరికంలోనే బతుకులు వెళ్లదీశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వారి బతుకులను ప్రగతి పథంలో నడిపించేలా 'నవరత్నాల' పథకాలను అమలు చేస్తున్నారు. మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామాన్ని పరిశీలిస్తే వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామంలో అధిక శాతం కుటుంబాలకు ఎంతో మేలు జరిగిందనే విషయం స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన నల్లిపోగు చెన్నయ్య కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.2.80 లక్షలు అందాయి. కుటుంబ పెద్ద చెన్నయ్యకు వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ఇప్పటి వరకు రూ.81 వేలు అందింది. అలాగే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.30 వేలు అందుకున్నారు. చెన్నయ్య భార్య సలోమి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.75 వేలు లబ్ధి పొందారు. వారి కుమార్తె జ్యోతి 'జగనన్న విద్యాదీవెన' ద్వారా రూ.60 వేలు లబ్ధి పొందగా, కుమారుడు ప్రభుకుమార్ 'అమ్మఒడి' పథకం ద్వారా రూ.42 వేలు అందుకున్నాడు. ఇక కంపసముద్రం గ్రామ అభివృద్ధికి పరిశీలిస్తే.. పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖల ద్వారా గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, పాల సేకరణ కేంద్రం, సిమెంటు రోడ్లు, ఉర్దూ పాఠశాల ప్రహరీ నిర్మాణం జరిగాయి.

పథకాల బాసట

కూలి చేసుకుంటే గానీ రోజు గడవని ఎన్నో కుటుంబాలు ప్రస్తుతం ఉత్తమ విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు పొందుతున్నాయంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలే కారణం. ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పారదర్శకంగా 'నవరత్నాల' పేరుతో అమలు చేస్తున్న పథకాలు పేదలకు ఆర్థిక వెసులుబాటు కలిగించి వారి జీవన ప్రమాణాలు పెరిగేందుకు బాసటగా నిలిచాయి.

– నల్లిపోగు చెన్నయ్య, కంపసముద్రం, మర్రిపాడు మండలం

అక్రమంగా బంగారు కొనుగోలుకు నగదు రవాణా

• కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యాపారం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న సిటీ, రూరల్ డీఎస్పీలు

నెల్లూరు(క్రైమ్): కొందరు బంగారు వ్యాపారులు చట్ట వ్యతిరేక మార్గాల్లో ఎలాంటి బిల్లులు లేకుండా రూ.కోట్ల విలువ చేసే బంగారు కొనుగోలు చేసి వ్యాపారంలో లాభాలు గడిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. తమ వద్ద పనిచేసే వారి ద్వారా బంగారు కొనుగోలుకు రూ.7,23,50,000 నగదు చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాలకు తరలిస్తుండగా నెల్లూరులో పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపన్ను శాఖ అధికారులకు నగదును పోలీసులు అప్పగించారు. బంగారు వ్యాపారులు చెన్నైలోని వివిధ ప్రాంతాల నుంచి అక్రమ మార్గంలో బంగారును కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. బంగారాన్ని చెన్నై నుంచి వ్యాపారులకు చేరవేసినందుకు గాను సదరు వ్యక్తులకు కమీషన్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియ గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది.

సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలి

నగదు, బంగారు, వెండి తదితరాలు తరలించే వారు సంబంధిత బిల్లులు, ధ్రువీకరణ పత్రాలను తమ వెంట తీసుకెళ్లాలని డీఎస్పీలు తెలిపారు. బిల్లులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా రవాణా చేస్తే వాటిని సీజ్ చేసి ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు. వీలైనంత మేరకు ప్రజలు డిజిటల్ పద్ధతిలో నగదు వినియోగించుకోవాలని సూచించారు.

సిబ్బందికి అభినందన

పెద్ద ఎత్తున నగదును సీజ్ చేసిన నవాబుపేట, వెంకటాచలం ఇన్‌స్పెక్టర్లు ఎం.బాబి, బి.అంకమ్మరావు, నవాబుపేట ఎస్సై బి.శివప్రకాష్, సిబ్బంది కె.శ్రీనివాసులు, సురేంద్రబాబు, జి.వి.రత్నం, బి.మోహన్‌బాబు, ఎం.వేణు, జి.మస్తాన్, మోహన్‌కృష్ణ, ఫిరోజ్, రఫీ, వినయ్, ప్రభాకర్, వెంకటాచలం సిబ్బంది పి.రాజారామ్, శ్రీహరి, సుబ్బారావు, పెంచలయ్య, శ్రీనివాసులు, పొదలకూరు కానిస్టేబుల్ ప్రతాప్‌లను ఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

'పెదపవని' స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగవేణి

లింగసముద్రం: కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అందించే ప్రతిష్ఠాత్మక నేషనల్ గ్రీన్ అవార్డులను రాష్ట్రంలోని 12 పాఠశాలలు దక్కించుకున్నాయి. ఉత్తమ గ్రీన్ రాష్ట్రంగా ఏపీ మూడో స్థానంలో నిలిచింది. 12 స్కూల్స్‌లో లింగసముద్రం మండలం పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఒకటిగా నిలిచింది. ఇటీవల ఢిల్లీలోని సీఎస్ఈలో సీఎస్ఈ డైరెక్టర్ సునీతా నారాయణన్ చేతుల మీదుగా పెదపవని స్కూల్ కో–ఆర్డినేటర్ జి.నాగవేణి గ్రీన్ అవార్డును అందుకున్నట్లు ప్రిన్సిపల్ కె.స్నేహలత గురువారం తెలిపారు. గ్రీన్ పాఠశాలగా ఎంపిక కావడానికి ప్రోత్సాహం అందించిన ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ టి.హేమలతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంతర్జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక


ఆరాధ్య

నెల్లూరు(టౌన్): బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన ఆరాధ్య కృతి కొల్లేజ్ మేకింగ్ విభాగంలో రజత పతకాన్ని సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించింది. ఈ బాలిక నెల్లూరు చంద్రారెడ్డి హైస్కూల్లో రెండో తరగతి చదువుతోంది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న రంగోత్సవ్ సంస్థ బాలబాలికలకు కలరింగ్, హ్యాండ్ రైటింగ్, కొల్లేజ్ మేకింగ్, కార్టూన్, గ్రీటింగ్ కార్డ్, టాటూ మేకింగ్, ఫింగర్ అండ్ థంబ్ పెయింటింగ్, ఫొటోగ్రఫీ తదితర కేటగిరీల్లో ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తోంది. పిల్లల్లోని నైపుణ్యాలను వెలికితీసి వారి ప్రతిభను చాటి చెప్పేందుకు జరిగిన ఈ పోటీల్లో ఆరాధ్య కృతి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది.

డీడీకి పురస్కారం


మంత్రి నుంచి పురస్కారం అందుకుంటున్న కోటేశ్వరరావు

నెల్లూరు(సెంట్రల్): విధి నిర్వహణలో ప్రతిభ చూపిన నెల్లూరు వెటర్నరీ పాలి క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు గురువారం రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ ప్రతిభ చూపిన పలువురు జిల్లా అధికారులకు, ఉప సంచాలకులకు, వెటర్నరీ పాలి క్లినిక్, ప్రాంతీయ, జిల్లా స్థాయి పశు వ్యాధి నిర్ధారణా కేంద్రాల అధికారులకు మంత్రి డాక్టర్ అప్పలరాజు పురస్కారాలు అందజేశారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


రమణయ్య మృతదేహం

ఉదయగిరి: మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో విద్యుదాఘాతానికి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన గెట్టిపోయిన రమణయ్య (50) విద్యుత్ మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సున్నంవారిచింతల వనం తోపులోని ఆలయాలకు విద్యుత్ సరఫరా కావడం లేదని స్థానికులు అతడికి తెలిపారు. దీంతో మరమ్మతులు చేసేందుకు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు తొలగించి విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈ సమయంలో హెచ్‌టీ లైన్ తగలడంతో రమణయ్య షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీనివాసులు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విశ్వసనీయతకు మారుపేరు జగన్


మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతకు మారుపేరు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఆయన నెరవేర్చారు' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన విడవలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆసరా కింద మండలంలో 920 పొదుపు సంఘాలకు 4వ విడతలో రూ.6.52 కోట్లు సాయం చేసినట్లు తెలిపారు. ఈ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశామని, ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారికి అండగా నిలిచిన ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. నేడు దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఇన్నేళ్లు కనిపించని ప్రతిపక్ష నాయకులు ఎన్నికలు సమీపిస్తున్నాయని రకరకాల వేషాలతో గ్రామాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. హామీలివ్వడం, ప్రజలతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంలో మహిళలే ముఖ్య పాత్ర పోషించారని, 2024లోనూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్ రెడ్డి, డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, నాయకులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ ఆదాల, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగుతోందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని ఒకటో డివిజన్ నారాయణరెడ్డిపేటలో గురువారం రూ.75 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పనుల కోసం మరో రూ.35 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కోడూరుపాడు, నారాయణరెడ్డి ప్రాంతాలతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. స్థానిక నేతల సహకారంతో వాటిని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల రూపంలో నగదు నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. తొలుత ఎంపీకి ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు లేబూరు పరమేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, కార్పొరేటర్ నాగరాజు, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, నాయకులు హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో గ్యాంగ్ మాటల్ని పట్టించుకోవద్దు


కనుపూరుపల్లిలో ప్రజలతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లో గ్యాంగ్ కావాలనే దుష్ప్రచారం చేస్తోంది. వారి మాటల్ని ప్రజలు పట్టించుకోవద్దు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనుపూరుపల్లిలో గురువారం నిర్వహించిన విజయీభవ యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్న వారికి గర్వకారణంగా నిలుస్తాయన్నారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధితోపాటు చేయాల్సిన పనులను సైతం సచివాలయాల వారీగా బోర్డులు ఏర్పాటు చేసి వివరిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్రను తూతూ మంత్రంగా నిర్వహించి అభాసుపాలైనట్లు చెప్పారు. గతంలో 600 హామీలిచ్చి ప్రజలను మోసగించిన చరిత్ర చంద్రబాబుకు ఉందన్నారు. ఆయన కొత్తగా ఇస్తున్న హామీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిల్లారు ఆదిశేషయ్య, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీల అధ్యక్షులు సానా వేణుగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఇంకా డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, మొలబంటి రాజశేఖర్, పాడమేకల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

7న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఇంటర్వ్యూ

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఈనెల 7వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకుని ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. బోధనానుభవం, నీట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత గల వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. నెలకు రూ.28 వేలు గరిష్టంగా వేతనాన్ని చెల్లిస్తామని తెలియజేశారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య


వెంకటేశ్వర్లు మృతదేహం

నెల్లూరు(క్రైమ్): భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరు యాదవవీధిలో విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు (48) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి వినయ్ అనే కుమారుడు ఉన్నాడు. వెంకటేశ్వర్లు కూలి పనులు, విజయలక్ష్మి పాల వ్యాపారం చేస్తారు. వెంకటేశ్వర్లు కొంతకాలంగా నిత్యం మద్యం తాగుతూ భార్యతో గొడవపడేవాడు. ఆమె, కుమారుడు, తల్లి జయమ్మ మందలించినా అతనిలో మార్పురాలేదు. బుధవారం వెంకటేశ్వర్లు భార్య వద్ద నగదు తీసుకుని మద్యం తాగొచ్చాడు. మధ్యాహ్నం భోజనంలోకి చేపల కూర వండలేదని భార్యతో గొడవపడి రైలు కింద పడి చనిపోతానంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్తుండగా కుటుంబ సభ్యులు అడ్డుకుని గదిలో వేసి తలుపు వేశారు. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్వర్లు గడి పెట్టుకుని చీరతో సీలింగ్ హుక్కుకు ఉరేసుకున్నాడు. కొద్దిసేపటికి భార్య, కుమారుడు తలుపు తీయమని ఎంతసేపు తట్టినా లోపలి నుంచి అలికిడి లేకపోవడంతో స్థానికుల సహకారంతో పగులగొట్టి చూశారు. వెంకటేశ్వర్లు ఉరేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబసభ్యులు అతడిని కిందకు దించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. విజయలక్ష్మి గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అండర్–14 రగ్బీ జట్టు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన వారితో హెచ్‌ఎం, పీడీ, కోచ్‌లు

కొడవలూరు: మండలంలోని గండవరం జెడ్పీ హైస్కూల్లో జిల్లా అండర్–14 రగ్బీ జట్టును గురువారం ఎంపిక చేశారు. ఇందులో ఎస్కే ఫిరోజ్, సీహెచ్ జితేంద్ర, సీహెచ్ మోక్షజ్ఞ, నరసింహ, నాయబ్ రసూల్, మొహిద్దీన్, జోయల్, నిశాంత్, చరణ్, శివరాజ్, సుధీర్, దినేష్, వెంకటరమణ ఉన్నారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రావణ్ కుమార్, పోతురాజు రమేష్ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఈ జట్టు శుక్రవారం నుంచి 4వ తేదీ వరకూ భీమిలిలో జరిగే 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ రగ్బీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. ఎంపికైన వారికి శ్రీవిద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీపతి రాము క్రీడా దుస్తులు బహూకరించగా, స్టేట్ క్రైమ్ కంట్రోల్, రీసెర్చ్ ఆర్గనైజేషన్ వారు మెడికల్ కిట్‌ను ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ సీహెచ్ శివనాగబాబు, కోచ్‌లు డి.వంశీ, శ్రీరాజ్, హిందీ పండిట్ జి.నాగభూషణం పాల్గొన్నారు.

చిన్న పిల్లల కిడ్నాపర్లకు రిమాండ్


చిన్నారిని అప్పగిస్తున్న పోలీస్ సిబ్బంది

విడవలూరు: చిన్న పిల్లలను కిడ్నాప్ చేసిన నలుగురు వ్యక్తులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు విడవలూరు ఎస్సై ఎం.రాజా తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన ఎల్లూరు చెంచయ్య – రాములమ్మ దంపతులు గ్రామంలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ రాత్రి సమయాల్లో బస్‌షెల్టర్‌లో నిద్రించేవారు. రోజూ మాదిరిగానే గత నెల 28వ తేదీన బస్‌షెల్టర్‌లో నిద్రిస్తున్నారు. ఈ విషయం గమనించిన పల్లిపాళేనికి చెందిన వెయ్యాల కవిత, ఊటుకూరుకు చెందిన తుపాకుల విజయ తల్లిదండ్రుల పక్కన పడుకొని ఉన్న 14 నెలల పోలయ్యను తీసుకుని పరారయ్యారు. కాసేపటి తర్వాత తల్లిదండ్రులు నిద్రలేచి చూడగా పోలయ్య కనిపించకపోవడంతో విడవలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య దర్యాప్తు చేపట్టి సీసీ టీవీ ఫుటేజ్ సాయంతో కిడ్నాపర్లు కావలి వైపు వెళ్లారని గుర్తించారు. కానిస్టేబుల్ పి.నరసింహులు, కె.కిరణ్ అదేరోజు మధ్యాహ్నం కిడ్నాపర్లు కవిత, విజయను కావలి తుమ్మలపెంట దారిలో పట్టుకుని బాలుడిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించి వారి ఇళ్లలో తనిఖీలు చేయగా, మరో ఆరేళ్ల బాలుడు శ్యామ్ పోలీసులకు దొరికాడు. దీంతో కంగుతిన్న పోలీసులు స్టేషన్‌కు వచ్చి కిడ్నాపర్లను విచారించగా, ఆ ఇంట్లో దొరికిన బాలుడిని వారం రోజుల క్రితం కొత్తకోడూరు బీచ్ వద్ద నుంచి తీసుకొచ్చినట్లు తెలిపారు. పోలీసులు బాలుడి గురించి విచారణ జరిపి నెల్లూరు ములుమూడికి చెందిన సత్యవేటి దుర్గారావు – రమణమ్మ దంపతుల కుమారుడిగా గుర్తించారు. శ్యామ్, పోలయ్యను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కిడ్నాపర్ల వెనుక ఎవరున్నారనే కోణంలో విచారించగా ఊటుకూరు చెందిన ఆటో డ్రైవర్ జవ్వలపాటి గంగాధర్, పెద్దపాళేనికి చెందిన మీనంగారి శివశంకర్ వారికి సహకరించినట్లు తెలుసుకున్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు. కిడ్నాప్ కేసును ఛేదించి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

బంగారు గొలుసు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసులను గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. జగదీష్‌నగర్‌లోని వెంకటేశ్వర గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సుజాతమ్మ గురువారం సమీపంలోని పిండిమిల్లుకెళ్లారు. అనంతరం ఇంటికి బయల్దేరారు. జగదీష్‌నగర్ రోడ్డు వద్దకొచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి చిరునామా అడుగుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని సుమారు రూ.3 లక్షల విలువజేసే ఆరు సవర్ల బంగారు గొలుసు, నల్లపూసల దండను తెంపుకెళ్లారు. బాధితురాలు తన కుటుంబసభ్యులతో కలిసి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహబూబ్ సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 242
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25



పోలీస్ అధికారుల బదిలీలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీస్ అధికారుల బదిలీలు జోరుగా జరుగుతున్నాయి. తాజాగా సివిల్, ఏఆర్ డీఎస్పీలను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. పలువురు సీఐలు డీఎస్పీలుగా పదోన్నతి పొంది పోస్టింగ్‌లు పొందారు. ఎ.రామచంద్ర కందుకూరు నుంచి ప్రకాశం ఎస్‌బీకు, ఎ.శివాజీరాజా సీఐడీ అటాచ్డ్ టు నెల్లూరు సీసీఎస్ నుంచి సీఐడీకి, వై.శ్రీనివాసరావు సీఐడీ అటాచ్డ్ టు నెల్లూరు ఎస్సీ, ఎస్టీ సెల్ నుంచి సీఐడీకి, సి.విజయభాస్కర్ డీజీపీ కార్యాలయం వెయిటింగ్ నుంచి నెల్లూరు రైల్వేకు, ఆముదాల శ్రీనివాసరావు అప్పా అటాచ్డ్ టు సీసీఎస్ నంద్యాల నుంచి కందుకూరుకు, టి.సాయినాథ్ కర్నూల్ రేంజ్ (పదోన్నతి) నుంచి నెల్లూరు దిశకు, జి.మహాత్మా గాంధీ డీఏఆర్, నెల్లూరు నుంచి పల్నాడు డీఏఆర్‌కు, ఎస్.చంద్రమోహన్ హోంగార్డ్స్, నెల్లూరు నుంచి బాపట్ల డీఏఆర్‌కు, పి.వెంకటేశ్వరరావు డీఏఆర్, ఒంగోలు నుంచి నెల్లూరు డీఏఆర్‌కు బదిలీ అయ్యారు.

రేంజ్ పరిధిలో ఆర్ఎస్సైలు..

గుంటూరు రేంజ్ పరిధిలోని ఆర్ఎస్సైలకు బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా నుంచి ఎనిమిది మంది గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు బదిలీ కాగా, ఎనిమిది మంది ఇక్కడికి వస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి జి.రాజారత్నం, బి.వెంకటేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, బి.సుధీర్ కుమార్, పల్నాడు జిల్లా నుంచి పి.ఏసురాజు, ప్రకాశం జిల్లా నుంచి వై.శివరామకృష్ణ ప్రసాద్, ఎం.శ్రావ్య, ఎం.సునీల్‌బాబు మన జిల్లాకు, ఇక్కడ పనిచేస్తున్న పి.నారాయణ రెడ్డి, కె.కృష్ణప్రసాద్, ఎం.తిరుమలరెడ్డి, ఆర్.నాగరాజు గుంటూరు జిల్లాకు, పి.చంద్రమౌళి, ఎం.హరికృష్ణ పల్నాడు జిల్లాకు, ఎస్.రాజశేఖర్, వి.సురేష్‌బాబు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.